# విప్లవకారుడైన భర్త

అమ్మా! నన్ను ఆశీర్వదించి పంపవ్? ఇవ్వాళ నేను పోరాటంలో చేరబోతున్నాను!

బలరాజ్ హడావుడిగా యెక్కడినుంచో వొచ్చి తల్లిని అడుగుతున్నాడు. సత్తాబట్టలు కుట్టుకుంటున్నదల్లా లేచివొచ్చి, కొడుకుని దగ్గరకి తీసుకుంది.

సంతోషంతో ఆమెకళ్ళు మిరుమిట్లుగొలుపుతున్నాయి. ఎన్నాళ్ళనుంచో తను ఆశించి, గారాబంగా పెంచిన కొడుకు ఇవ్వాళ ఓ దేశభక్తుల కుటుంబంలో చేరబోతున్నాడు!!

స్వాతంత్ర్య సమరంలో ప్రాణాన్ని కోల్పోవచ్చు. సామ్రాజ్యవాదుల భీకర నిర్బంధానికి ఆహుతవచ్చు. ఎల్లాంటి కష్టాలన్నా ఎదుర్కోడానికి సిద్ధమౌతున్నాడు, తను కన్నకొడుకు! అచ్చు తండ్రిపోలికే.

ఆమెకి ఒక్కసారిగా తన భర్తసాగించిన విప్లవకార్యక్రమాలన్నీ జ్ఞాపకంవచ్చాయి! కాని రోజులు అట్లాలేవు. ప్రపంచ పరిస్థితులు ప్రపంచ విరోధులకి వ్యతిరేకంగా వున్నాయి. అంతర్జాతీయంగా ఎట్లాచూచినా ప్రజలదే పైచెయ్యి అవుతోంది. ప్రపంచంమీది అన్ని దేశాలూ అనుకోనంతగా అభివృద్ధి చెందివున్నాయి. అన్నిచోట్ల ప్రజాస్వామిక ప్రభుత్వాలు వస్తున్నాయి స్పష్టంగా ఇంక సామ్రాజ్యవాదుల కుట్రలు సాగవు. ప్రజలు సాగనీరు.

తన కొడుకుని యెట్లా పెంచాలని ఆశించిందో, ఆ కోరిక ఇప్పుడు నెరవేరడం చూస్తోంది. తన భర్తకి, తన కొడుకు భవిష్యత్ యెట్లా వుంటుందని, అతడు తండ్రి ఆశయాలను ఎట్లా నెరవేరుస్తాడని ప్రతిజ్ఞ చేసిందో, తను దేనికోసరం యిన్నాళ్లూ జీవితం భరించిందో అది యీనాడు నిజమౌతోంది. కలకాదు కథ!

"ఇట్లాకూచో"

ఇద్దరూ పక్కగా చినిగిపోయిన తివాచీమీద కూచున్నారు. గాలి ఆమె కుడుతూ, వొదిలివేసిన కొత్తబట్టల వాసనని మోసుకొస్తోంది. అతడు తల్లి హృదయంలోని ప్రశాంతతనీ, ఆనందాన్నీ అర్థంచేసుకున్నట్టు చూస్తున్నాడు.

"ఈరోజు కోసరమే నేను పద్ధెనిమిదేళ్ళనించీ జీవించి వుంది. మీనాన్న వురితీయపడ్డ తక్షణం ఆత్మహత్య చేసుకుందామా? అనిపించింది. కాని అది దేశభక్తుల నమ్మకాలకి వ్యతిరేకమే అనుకో. అయినా అప్పటి కష్టం అట్లా అనిపించింది.

"నువ్వు పోరాటంలో చేరబోయేమునువు ఈ మాటలు వినిపో. ఇవి నీకు, నీ

కార్యక్రమాల్లో యెంతో ధైర్యాన్నీ నమ్మకాన్నీ కలిగిస్తాయి.

"మీ నాన్నని గురించి అట్టే తెలీదు నీకు. ఒక దేశభక్తుడనీ, వురితీయించబడ్డాడనీ మాత్రమే తెల్సు.

"ఆయన జీవితంగురించీ, పడ్డ కష్టాలగురించి చెప్పాలంటే యెన్ని రోజులన్నీ చాలవు. ఒక చివరిసంఘట మాత్రమే చెబుతాను.

''ఆయనమీద ఉరిశిక్ష ఖాయమయింది. ఆ మాట వినగానే నాకు కాళ్ళు తెగిపోయినట్టయింది. చనిపోదామా? అనుకున్నాను కాని నువ్వు... అప్పటికి ఆర్నెల్లు?

"మీ నాన్నతోపనిచేసే మిగతావాళ్ళు ఏది చెయ్యలేనితనం, ఎట్లాగో పగ సాధించాలనే అభిలాక్షలతో పడికొట్టుకుంటున్నారు.

"న్యాయంకోసం, సత్యంకోసం, స్వాతంత్ర్యంకోసం పోరాడే భక్తులకి లభించేది ఊరా? ప్రపంచానికి ఎప్పటికన్నా న్యాయం వొస్తుందనుకోగలమా?

"మీ నాన్న ఎంతధైర్యం చూపించేవారు. నాకు పిచ్చినవ్వు! ఎందుకో ఆ మొండిధైర్యం. అన్యాయంగా ప్రాణంపోతుంటే? అని.

"రెండు రోజులకు వురితీయబడతారనగా చివరిసారి చూడాలని అభిలాష కలిగింది. ఎవరూ చూసేందుకన్నా అనుజ్ఞలేదు.

"చివరికి కాపలవాళ్ళని పట్టుకున్నాం. నేను ఆయన భార్యననీ, ఒకసారి కల్సుకుందుకు అవకాశం కల్పించమనీ, ఏ చౌర్యానికీ రాలేదనీ ఒప్పించడానికి తాతలు దిగివచ్చినంత పనయింది. కాని వాళ్ళు, ఈదేశభక్తుల బంధువులన్నా నమ్మడానికి వీల్లేదన్నట్టు ప్రవర్తించారు.

"మొత్తంమీద లంచమిచ్చి, ఒప్పించాం పెద్ద నిఘాతో మొదట నన్ను పరీక్షించిపంపారు.

"ఆ వేళ వెన్నెలరాత్రి. కటకటాల్లోంచి వెన్నెల గదిలో పడుతోంది. మీనాన్న ప్రశాంతంగా కూచుని ఆలోచిస్తున్నారు. చనిపోయాక ఇతర లోకాల్లో ఏ కార్యక్రమాలవసరముంటాయా? అని గావును.

"చిన్న నవ్వుతో నన్ను ఆహ్వానించారు. అంత మృత్యుగహ్వరంలో వుండికూడా పెదిమలమీద చిరునవ్వు ఎంత గొప్పతనం తమ ప్రాణం పోతుందంటే తమకే పట్టనట్టున్నారు.

"మొదట తమ మిత్రులక్షేమాన్ని అడిగారు. సానుభూతి, విచారం, అధికమైనప్రేమ, ఆయన ధీరత్వాన్ని చూసి ఆహ్లాదం, అన్నీ ఆవరించాయి నన్ను. ఏం చెయ్యాలో తెలీక అట్లా నించున్నాను.

"ఆయనంటున్నారు! 'నువ్వుమాత్రం మళ్ళీకుళ్లు ప్రపంచంలోకిపోక! నీలోని ఇన్నాళ్ళ చైతన్యం, నా సహవాసం వృథాగావనుకుంటాను. నువ్వన్నా చూడాలి మనదేశ స్వాతంత్ర్యం!'

"మెల్లిగా అర్థంచేసుకోమన్నట్టు చెబుతున్నారు. 'నేను ఎట్లాగా చనిపోతాను. నాకేం భయంలేదులే. కానివాడు... కొడుకే పుడతాడని నా నమ్మకంలే... వాడు దేశ భక్తుడు కావాలి. ఈలోపలే నువ్వూ, తక్కిన సోదరులూ, వాడికి కష్టంలేకుండా స్వాతంత్ర్యం సంపాయించి

పెడతారనుకుంటాను. నేను చచ్చిపోయాక... చెయ్యి పట్టుకుని కూచోపెడుతున్నారు. నాకు దుంఖం పొర్లివచ్చింది. భుజంమీద ఆని వెక్కి వెక్కి ఏడుస్తున్నాను.

"పిచ్చిపిల్లా! ఏడవకు, లే! సంతోషంతో ఉరికంబం ఎక్కే భర్తకి, నీ ధైర్యంకూడా జతపర్చు తక్కిన అందరి భార్యల్లా భర్త గౌరవాన్ని పాటించక పోవడానికా నువ్వు? మాటలుకాదు. ఆచరణలో కావాలి" నా చెంపలమీది నీళ్ళని మాసిన చొక్కాతో తుడుస్తున్నారు.

"అమాయికంగా ఆయన గొప్పతనాన్ని అర్థంచేసుకుందుకు కళ్ళల్లో చూస్తున్నారు. ఆయన ఇంకా అంటున్నారు. ధైర్యం చూపించని భార్యవుకాదు దేశభక్తుడి భార్యవని మరవకు, నా ప్రాణంకోసం అంతకోరికా? మనమేం భగవత్ సింగ్‌లకంటే గొప్పవాళ్ళమా యేం? – వాణ్ణిమాత్రం గొప్పగా పెంచు. అప్పటికి దేశస్వాతంత్ర్యం వస్తేసరి వస్తుందనే నా నమ్మకం కూడా. రాకపోయినా వాణ్ని దేశభక్తుడిగా, విప్లవకారుడిగా చేసే బాధ్యత నీది. ఏ పోరబాటు జరిగినా నీ చనిపోయిన భర్తకి అపరాధంచేస్తున్నానని, అతని ఆత్మశాంతికి విఘ్నంకల్గిస్తున్నానని జ్ఞాపకం తెచ్చుకో బెదురు లేకుండా ఉరికంబం ఎక్కిన నీభర్తని స్మరణకు తెచ్చుకో... ప్రతిజ్ఞ చెయ్యి నా కొడుకుని విప్లవకారుణ్ణి జేస్తానని'

"అట్లా చేతిలో వొట్టు వేయించుకున్నారు. నా జీవితమంతా కడసారి ఆయన కావలించుకున్నారు. ఆయనకోసం నా ప్రాణమన్నా ఇస్తానని ప్రతిజ్ఞచేసాను. తిరిగి వొచ్చేటప్పుడు ఒకసారి ముద్దుపెట్టుకుని, మళ్ళీ ప్రతిజ్ఞ తీసుకుని పంపారు.

"నే నిదివరకెప్పుడూ చెప్పలేదు, నీ తండ్రికి చేసిన ప్రతిజ్ఞ. ఇప్పుడు నాజీవితాన్ని ఓసారి తడిమిచూసుకో. ప్రతి అంగుళంలోనూ ఇదే అర్థం. ఇదే తాత్పర్యం కనపడుతుంది.

"మీనాన్న ఆశించినట్టు స్వాతంత్ర్యం సంపాయించలేకపోయినా ఓ పెద్ద రాజకీయసంఘాన్ని నీకు సంపాదించి వుంచాం! గాంధి, నెహ్రూ మొదలైన నాయకులెందరో వున్నారు.

"నీ ప్రతీచర్యకీ వాళ్ళంతా ఉద్రేకమిస్తారు. ఉద్రేకమేమిటి? వాళ్ళ నాయకత్వం క్రిందే కోట్లాదికోట్ల ప్రజలు నడుస్తున్న జెండానీడల్లో నువ్వు ముందుకుపోవాలి! నువ్వో దేశభక్తుడివి".

దగ్గరకుతీసుకుని, జుత్తు నిమురుతూ నుదుటిమీద ముద్దుపెట్టుకుని ఆశీర్వదించి పంపింది.

బలరాజ్ ఇంతవరకు వూపిరన్నా వొదలకుండా శ్రద్ధగా తనతండ్రి సంగతంతా విన్నవాడు, గోడమీది తండ్రి పటాన్ని చూసి, మనస్సులోనే నమస్కరించాడు.

మెల్లిగా లేచి, వెళ్ళసాగాడు. సందుచివరివరకు తల్లి గుమ్మందగ్గరనుంచుని కొడుకుతోవ సరిచూస్తోంది. ఆమె చూపులు అంటున్నాయి!

"స్వతంత్ర భారత్‌కు జై!" అని.